క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి రూ. 50 వేల విరాళం



విరాళం అందిస్తున్న నవీన్‌నిశ్చల్

లేపాక్షి: శిరివరం గ్రామంలో వెలిసిన కోడిరంగ నాథస్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఈనేపథ్యంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఏపీ ఆగ్రోస్ మాజీ చైర్మన్ బి.నవీన్‌నిశ్చల్ శనివారం తన ఇంటి వద్ద ఆలయ కమిటీ సభ్యులకు రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వాలి

సోమందేపల్లి: అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు బాలస్వామి, నూర్జహాన్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి సరుకుల అందజేత

హిందూపురం టౌన్: హెచ్‌డీబీ ఫైనాన్స్ ఆధ్వర్యంలో స్థానిక సహస్ర ప్రణామ్ అనాథాశ్రమానికి నెలకు సరిపడా సరుకులను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలన



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాధమ్మ, సర్పంచ్ కరుణాకర్‌గౌడు

గుడిబండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీపీ రాధమ్మ, సర్పంచ్ కరుణాకర్‌గౌడు, అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. తరగతి గదులు, వంట గది, తాగునీటి వసతి తదితర వాటిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిండంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో 35 ఏళ్ల క్రితం నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, మరమ్మతు చేయించాలని ఉపాధ్యాయులు ఎంపీపీని కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఎంపీడీఓ గంగాధర్, ఎంఈఓ–2 రవిచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట



రొద్దంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీ

రొద్దం/ పెనుకొండ/ లేపాక్షి/ అమరాపురం/ గుడిబండ/ హిందూపురం టౌన్/ మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మ అన్నారు. పెనుకొండ, రొద్దం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆమె ఎంపీ బీకే పార్థసారథితో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 475 కళాశాలల్లో 1.50 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తహసీల్దార్ నాగేంద్ర, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్ పాల్గొన్నారు. లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. అమరాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థులకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణనాయక్, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబులపతి స్వయంగా భోజనం వడ్డించారు. గుడిబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీడీఓ గంగాధర్, ఎంఈఓ–2 రవిచంద్ర, మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంఈఓ భాస్కర్, కళాశాలల ప్రిన్సిపాళ్లు సుజాత, మహేష్, హిందూపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంఈఓ గంగప్ప పథకాన్ని ప్రారంభించారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..



- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజన
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ

హిందూపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు ఇంటర్ మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఇంటర్ బోర్డు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ఈ నెల ఒకటి నుంచి సంకల్ప్–2025 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాల సమయాన్ని పెంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 6220 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, అన్ని గ్రూపుల విద్యార్థులకు ఈ కార్యక్రమం కొనసాగుతోంది. 100 శాతం ఫలితాలే సాధనగా ముందుకు సాగుతున్నారు.

ప్రత్యేక తరగతులు..

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గతంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు ఉండేవి. ఈ నెల 1వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు ఉంటాయి. అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులకు అధ్యాపకులు తర్ఫీదు ఇస్తున్నారు. చదువులో వెనుకబడిన వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



ప్రత్యేక తరగతికి హాజరైన ఇంటర్ విద్యార్థులు

కేర్ టేకర్లుగా అధ్యాపకులు..

క్వార్టర్లీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. చదువులో వెనుకబడిన వారిని సీ కేటగిరీగా విభజించారు. వీరి కోసం ఇంటర్ బోర్డు ప్రతి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అన్ని గ్రూపులకు సంబంధించిన క్వశ్చన్ బ్యాంకును సరఫరా చేసింది. వెనుకబడిన విద్యార్థులు కూడా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇచ్చేందుకు జూనియర్ లెక్చరర్లను కేర్ టేకర్లుగా నియమించారు. కేర్ టేకర్లు వారికి కేటాయించిన విద్యార్థులను మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదివించడం, రాయించడం చేస్తున్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులతో ఉపయోగం



కాలేజీలో నిర్వహించే ప్రత్యేక తరగతులు ఉపయోగకరంగా ఉన్నాయి. రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చదివించడంతో పాటు చూడకుండా రాయిస్తున్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. దీని వల్ల మంచి మార్కులు సాధించేందుకు ఆస్కారం ఉంటుంది.

– కె.బీ.భరత్ కుమార్, బైపీసీ ఫస్టియర్, ఆదర్శ పాఠశాల

అర్థమయ్యేలా బోధిస్తున్నారు



ప్రత్యేక తరగతుల్లో ఆధ్యాపకులు అర్థమయ్యేలా బోధిస్తున్నారు. సబ్జెక్టులతో పాటు రాయించడం, చదివించడం వంటివి చేయిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాతో పాటు ఉంటూ తరగతులు నిర్వహిస్తున్నారు. మాకు అర్థం కాని సబ్జెక్టులు కూడా నివృత్తి చేసుకోవడానికి సమయం దొరుకుతోంది.

– ఈ.మహేష్, బైపీసీ సెకండియర్, ఆదర్శ పాఠశాల

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. కేర్ టేకర్లను నియమించి విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులపై వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుని సబ్జెక్టుల్లో వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు చదివించడం, రాయించడం చేస్తున్నాం.

– అశోక్‌నాయక్, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

హిందూపురం: అంధుల సంఘ విజ్వనీ ఇంపైడ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎంజీఎం గ్రౌండ్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా అంధులకు ఆటల పోటీలు నిర్వహిం చి విజేతలకు మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి బహుమతులు అందజేశారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈఓ గంగప్ప, అసోసియేషన్ నాయకులు నాగప్ప, ఎల్లప్ప, అనిల్ పాల్గొన్నారు.

అగళి: స్థానిక భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, దివ్యాంగులతో కలిసి బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.



క్యాలెండర్ విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్

రొళ్ల: భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. దివ్యాంగుల విద్యార్థులతో కలిసి ఎంఈఓ శ్రీధర్ కేక్ కట్ చేసి స్వీట్లను పంచి పెట్టారు. హెచ్‌ఎం తిమ్మరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

హిందూపురం టౌన్: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంజనమూర్తి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మండల రిసోర్స్ సెంటర్‌లో ఏపీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీని ఎంఈఓ గంగప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు వెంకటరమణ, జిల్లా ఆడిట్ కో కన్వీనర్ నారాయణస్వామి, మండల గౌరవాధ్యక్షుడు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి సీనియర్ నాయకులు సలీంబాషా, ఇలియాజ్, అనీష్ అహమ్మద్, గంగాధర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గంగప్ప, ఉపాధ్యాయులు

ముస్లింలకు అన్నివిధాలా సహకరిస్తాం

హిందూపురం: ముస్లింలకు అన్నివిధాలుగా సహకారం అందిస్తామని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. ఈ నెల 6,7 తేదీల్లో హిందూపురం సమీపంలోని పరిగి రోడ్డులో తలపెట్టిన ఇస్తెమా కార్యక్రమ ఏర్పాట్లను శనివారం మైనార్టీ సోదరుల ఆహ్వానం మేరకు పర్యవేక్షించారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఇస్తెమా ప్రాంతంలో భోజనం స్టాల్, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మతపెద్దలు సాదిక్, ముతవల్లిలు బాష, రఫీక్, ఖలీం, హుమయున్, మైనారిటీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ చాంద్ బాషా, వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌వీ.శివ, నాయకులు శ్రీరామరెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, వార్డు ఇంచార్జులు అయూబ్ బేగ్, ఫారూక్, ఆసిఫ్ ఖాన్, చాందు, దాదు, శబరీష్ రెడ్డి, షేక్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. మోతుకుపల్లికి చెందిన సీనియర్ కార్యకర్త అశ్వర్థకు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వేణురెడ్డి మోతుకుపల్లిలోని అశ్వర్థ నివాసానికి వెళ్లి ఆయన్ను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌వీ శివ, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, న్యాతరెడ్డి, నాయకులు నవీన్‌రెడ్డి, సతీష్ రెడ్డి, గోవిందప్ప, వెంకటేష్, రామకృష్ణ, మురళి, రామాంజినేయులు, ఆదినారాయణ, మధు పాల్గొన్నారు.



ఇస్తెమా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గుడ్డంపల్లి వేణురెడ్డి, నాయకులు

ఆరోపణలు అర్థరహితం

పెనుకొండ: సోమందేపల్లిలో తాము భూమి కబ్జా చేసినట్లు ఆ గ్రామానికి చెందిన దళిత ముత్యాలు ఆరోపణలు అర్థరహితమని పెనుకొండకు చెందిన రామలింగ, వెంకటనారాయణచౌదరి పేర్కొన్నారు. శనివారం సాక్షి దినపత్రికలో పచ్చనేతల దౌర్జన్యకాండ శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో శనివారం వారు వివరణ ఇచ్చుకున్నారు. తాము రామగిరికి చెందిన రామ్మూర్తినాయుడుతో భూమిని కొనుగోలు చేశామన్నారు. తాము కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమన్నారు. ముత్యాలుకు తమకు సంబంధం లేదన్నారు. కొనుగోలు చేసిన భూమికి సర్వే చేయించి ఫెన్సింగ్ వేశామన్నారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

పెనుకొండ: టెన్త్‌లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీ శాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మంత్రి యూటీఎఫ్ మోడల్ పేపర్లను అందించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, హెచ్‌ఎం జ్యోతిలత, ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామాత్యులు సవిత ఆవిష్కరించారు. ఎస్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన స్వయం సేవకులు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల నుంచి 80 మంది రాష్ట్రీయ స్వయం సేవకులు శనివారం విజయవాడకు తరలివెళ్లారు. విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో ఆదివారం నిర్వహించే హైందవ శంఖారావం కార్యక్రమానికి వెళుతున్నట్లు నిర్వాహకులు నాగభూషణ, లింగేష్ తెలిపారు.

పెనుకొండ రూరల్: విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

విజయవాడలో ఆదివారం జరిగే హైందవ శంఖారావం సభకు వెళ్లే ముందు పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేపట్టారు. సభ్యులు వేదవ్యాస్, పూర్ణ చంద్ర రాము, సాయి ప్రసాద్, శ్రీనాథ్, కేదార్‌నాథ్, డాక్టర్ రంఘునాథ్ రెడ్డి, బొక్సంపల్లి రామకృష్ణ తదితురులు పాల్గొన్నారు.

హిందూపురం: విజయవాడలో ఆదివారం జరగనున్న హైందవ శంఖారావం సభకు శనివారం సాయంత్రం హిందూపురం నుంచి వివిధ హిందూ సంఘాల నాయకులు ప్రత్యేక రైలులో బయలుదేరారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి వందలాది మంది జెండాలు, బ్యానర్లు పట్టుకుని జైశ్రీరాం అంటూ నినాదాలు చేశారు. వారికి వ్యాపారులు ఆహారపొట్లాలు, తాగునీటి బాటిల్స్ అందజేశారు.

భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయండి

పావగడ: కాడు గొల్ల సామాజిక వర్గ సముదాయ భవన నిర్మాణానికి పట్టణంలో రెండెకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కాడు గొల్ల సామాజిక వర్గం నాయకులు శనివారం తాలూకా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వరదరాజు, మున్సిపల్ చైర్మన్ రాజేశ్‌కు వినతి పత్రాలు అందించారు. కాడు గొల్లల సంఘం నాయకుడు, మాజీ జెడ్పీ సభ్యుడు పాపణ్ణ, అధ్యక్షుడు బోరణ్ణ, గౌరవాధ్యక్షుడు సణ్ణప్ప, కార్యదర్శి పాపణ్ణ తదితర పదాధికారులు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు జపానంద అండ

పావగడ: తమిళ నాట ఇటీవల సంభవించిన పెను తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన తిండివనమ్ ప్రాంతంలో తినడానికి తిండి లేక నానా కష్టాలు పడుతున్న బాధితులకు స్థానిక రామకృష్ణ సేవాశ్రమం అధిపతి స్వామి జపానంద అండగా నిలిచాడు. ఈ సందర్భంగా తమిళనాడు వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న స్వామి జపానంద ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో తిండివనమ్, పాండిచ్చేరి, వెల్లుపురం ప్రాంత బాధితులకు 600 నిత్యావసరాల కిట్లు, దుస్తులు, దుప్పట్లు, స్వెటర్లు, వంట సామగ్రి అందించారు.

స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే

పావగడ: భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అందరికీ స్ఫూర్తి ప్రదాత అని వక్తలు పేర్కొన్నారు. స్థానిక బీఈఓ కార్యాలయంలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఈఓ ఇంద్రాణమ్మ సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసీఓ లు వేణుగోపాలరెడ్డి, చంద్రశేఖర్, ఎస్‌డీఏ అరుణ్ కుమార్, ఖాజా హుస్సేన్, శివకుమార్ పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల సర్వేపై అవగాహన

రొళ్ల: తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి షెడ్యూల్డ్ కులాల సర్వే పై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ ఎస్టీ, బీసీ, మైనార్టీలుగా నమోదైన ఎస్సీలు సర్వేలో సరిదిద్దుకోవచ్చన్నారు. దీనిపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు.

విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ గోపాల్‌రావు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల, పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజును పీహెచ్ కృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెల్లించారు. ఈ సందర్భంగా శనివారం ఎంజీఎం పాఠశాలలో ట్రస్ట్ చైర్మన్ గోపాల్‌రావు రూ.10 వేలను హెచ్‌ఎంలకు అందించారు. ఎంజీఎం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమణ, ఓరియంటల్ పాఠశాల హెచ్‌ఎం పెన్నోబలం, ట్రస్ట్ కార్యదర్శి సుధీంద్ర, ట్రెజరర్ లక్ష్మి, సభ్యులు హెచ్‌ఎం శ్రీనివాసమూర్తి, కంఠశాస్త్రీ, లక్ష్మీనారాయణ, ప్రాణేష్ రావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యనారాయణ శాస్త్రి, అశ్వర్థప్ప, బాల కంబన్న, వెంకటశివుడు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

పావగడ: నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం స్వామి జాతర మహోత్సవంలో భాగంగా సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణోత్సవం శనివారం కమనీయంగా సాగింది. ఆలయం ఆవరణలోని మండపంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పురోహితుల పెళ్లి మంత్రాలు, భజంత్రీలు, మేళతాళాల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు భక్తులు పాల్గొని స్వామివార్లకు అక్షింతలు వేశారు. మరో వైపు ఆలయంలో ప్రధాన అర్చకుడు బదరీనాథ్ మూల విరాట్ సుబ్రహ్మణ్యం స్వామికి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో సుబ్రహ్మణ్యం స్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరగనుంది.

నేడు కేంద్ర రైల్వే సహాయమంత్రి రాక

పెనుకొండ: పెనుకొండకు ఆదివారం కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమణ్ణ రానున్నట్లు రైల్వే శాఖ అధికారులు శనివారం తెలిపారు. పట్టణంలో గత ప్రభుత్వంలో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9–30 గంటలకు మంత్రి పెనుకొండకు రానున్నట్లు వివరించారు.

వలంటీర్లను మోసగించిన చంద్రబాబు

- ఈరలక్కప్ప

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు వార్డు, గ్రామ వలంటీర్లను నమ్మించి మోసం చేశారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఈమేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వలంటీర్లకు నెలకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఇప్పుడు వారిని పట్టించుకోకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వలంటీర్లను రోడ్డున పడేసిన ఘనత బాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో ముందు చూపుతో వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేశారని గుర్తు చేశారు. దేశంలోనే ఎంతో ఆదర్శంగా నిలిచిన వలంటీర్ల వ్యవస్థను చంద్రబాబు నిర్వీర్యం చేసి రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. వలంటీర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని లేకపోతే చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ధర్మవరం తరలిన నేతన్నలు

సోమందేపల్లి: ధర్మవరంలో శనివారం జరిగిన నేసే కుల సంఘం సమావేశానికి సోమందేపల్లి నుంచి భారీగా తరలివెళ్లారు. లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మంటపం నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. తొగట వీర క్షత్రీయ సంఘం అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో జన సమీకరణ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సర్వేలు పూర్తి చేయండి

హిందూపురం అర్బన్: హౌస్‌హోల్డ్, పారిశ్రామిక, వివిధ పథకాల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. అనంతరం ఏఓ సుధీర్ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

ఆటో ఢీ – గొర్రెలు మృతి

అగళి: ఆటో ఢీకొన్న ఘటనలో 4 గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.... దావూద్‌పాళ్యకు చెందిన అక్బర్ తన ఆటోలో ఎర్రగడ్డల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తన వ్యాపారం ముగించుకుని అగళి నుంచి శిర వైపుగా ఆటోలో బయలుదేరాడు. బ్యాడగెర సమీపంలోకి చేరుకోగానే రోడ్డుపై వెళుతున్న గొర్రెల మందపైకి దూసుకెళ్లాడు. ఘటనలో నాలుగు గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి, నందరాజునలపల్లికి చెందిన గిరీష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో ఉన్న అక్బర్‌కూ గాయాలయ్యాయి.



నేడు సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు



పైడేటిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్

- ముస్తాబైన పైడేటి, పరిగి ఆలయాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

పరిగి: మండలంలో ఆదివారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు నిర్వహించేందుకు ఆలయాలు సిద్ధమయ్యాయి. ప్రముఖ క్షేత్రాలైన పరిగి, పైడేటిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఏటా సుబ్రహ్మణ్యషష్టి సందర్భంగా ఆయా గ్రామాల్లో వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. వేడుకలను చూడటానికి చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటకలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారు. ఐదు రోజుల పాటూ వేడుకలు నిర్వహిస్తారని ఆయా ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు తెలిపారు. ప్రధానంగా పంచమి నుంచి వేడుకలు ప్రారంభమవుతాయి. షష్టి రోజున స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, బ్రహ్మరథోత్సవం, అన్నసంతర్పణం తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పురాతన ఆలయం..

పైడేటి సుబ్రమణ్యేశ్వర ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. జయమంగళీ, పెన్నా నదుల కలయిక ప్రాంత అనంతరం వచ్చే పైడేటిలో దాదాపు 500 ఏళ్ల క్రితమే ఆలయ నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఎంతో విశిష్ట ప్రాధాన్యత, భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలుగొందుతున్న ఈఆలయంలో నిత్యం పూజలు నిర్వహిస్తూ ఎంతోమంది ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు. ప్రముఖ పైడేటి సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ఏటా నిర్వహించే పర్వదిన కార్యక్రమాలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంటాయి. వేలాది మంది స్వామి వారి దర్శించుకుని అక్కడ జరిగే కార్యక్రమాలను వీక్షించేందుకు తరలివస్తుంటారు. సత్బ్రాహ్మణులచే ఆహారం భుజింపబడిన ఎంగిలి విస్తరాలకు భక్తులు తమ నెత్తిమీద మోసుకుని పక్కనే ఉన్న పెన్నా నదిలో పారవేయడం పరమ పవిత్రంగా భావిస్తారు. గంటల కొద్దీ క్యూలైన్లో నిలబడి స్వామి దర్శనమే అంతిమంగా భావించి భక్తులు కార్యక్రమాల్లో పాల్గొంటారు. బ్రహ్మ రథోత్సవం, రాత్రివేళ తేరు ఉత్సవాలు ఆద్యంతం భక్తులకు వీనుల విందును పంచుతాయి. పరిగి సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్తలు భార్గవి, సతీష్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు మోహన్‌స్వామి నేతృత్వంలో షష్టి వేడుకలు జరుగుతాయి.